# "ఆ యింట శోకాంధ తిమిరావళి!"

(క థా ని క)

"ఇంకా రెండు గారెలు తీసుకురానా అబ్బాయ్?" అంటూ పెద్ద కుమారుడయిన సుబ్బారావు వద్దన్నా వినక, ఖాళీ అయి అతని దగ్గరవున్న పింగాణీ ప్లేటు తీసుకు వెళ్ళి దానిలో మూడు గారెలు పెట్టి, రెండో చేతితో నేతిగిన్నె పుచ్చుకొని కొడుకుదగ్గరకు తీసుకొస్తోంది గోవిందమ్మ. ఇంతలో వీధి గేటు తీసిన చప్పుడు అయింది. చేతిలో వున్న ప్లేటు, నేతిగిన్నె సుబ్బారావు ముందు పెట్టి గది తలుపు దగ్గరకు లాగి "ఎవరూ!" అంటూ వరండాలోకి వెళ్లింది.

"నేనే దొరసానిగారూ! సుబ్బిగాడిని" అన్న కంఠం వినిపించింది. మళ్ళీ ప్లేటులో గారె ఒకటి ఖాళీచేసి తడిచెయ్యి తువాలుతో తుడుచుకుంటూ సుబ్బారావు కూడా వరండాలోకి వచ్చాడు. సుబ్బిగాడి వెంట వాడి కూతురు చిరిగిన గౌను తొడుక్కుని, చింపిరి జుట్టుతో ఐదు, ఆరు సంవత్సరాల పిల్ల నిలుచున్నది. "దొరగారు వుండారా? తల్లీ" అని సుబ్బారావుని చూచి వెంటనే "నాయనగారు వుండారా బాబూ" అంటూ ఆతురతతో అడిగాడు.

"దొరగారు వుండారా! తల్లీ! నాయనగారు వుండారా బాబూ" అని ఆతురతతో తల్లీ కొడుకు లిద్దర్నీ అడుగుతున్నప్పుడు పీక్కుపోయిన వాడి ముఖం వెల్లడిచేసిన దైన్యస్థితిని చూస్తే ఏమాత్రం హృదయమున్న వ్యక్తికైనా తల తిరిగిపోతుంది.

"ఏమిటిరా దొరగారితో పని? నిద్రపోతున్నారు. ఆ పుంత్రివద్ద కూర్చో, లేచే వేళయింది" అన్నది గోవిందమ్మ. సుబ్బారావు చెయ్యి తుడుచుకోవటం చూచాడు కాబోలు, పుంత్రివద్దకు కూతురుతోసహా పోతూ "ఈపాటిదాకా భోంచెయ్యకుండా ఏం చేస్తున్నారు అబ్బాయిగారూ?" పొద్దెక్కితే తలకాయి నెప్పి చేత్తంది" అన్నాడు సుబ్బిగాడు స్వానుభవ పూర్వకంగా.

గోవిందమ్మ ఏదో ముంచుకుపోయినట్లు అటూఇటూ చూచి "మందుగుండు సామాను తెచ్చుకుంటానని బస్తీకి వెళ్ళి ఇప్పుడేవచ్చాడు. అందువల్ల భోజనానికి ఆలస్యం అయింది" అని యింట్లోకిపోతూ "అబ్బాయ్! పిండి కొట్టాలి. పొద్దెక్కిపోతోంది కొస్త యీ కుంది వెనక దొడ్లోకి పట్టుకెళ్ళాలిగాని యిటు రారా!" అన్నది. "మందుగుండు సామానుకొరకు బస్తీకి వెళ్ళటమేమిటి? అందువల్ల భోజనానికి ఆలస్యం కావటమేమిటి?" అని లోలోన ఆలోచిస్తూ "వస్తున్నా" నంటూ లోపలకు వెళ్ళాడు కుమారుడు. "కుంది గాదురా గారెలు సంగతి చెబితే ఆపిల్ల ముండ మారాము చేస్తుందని ఏవో మాయమాటలు చెప్పాను. కొంపతీసి గారెలు సంగతి నువ్వుగాని మళ్ళీ వాడిముందు ఎత్తావంటే నా పరువు కొస్తా మట్టిపాలు అవుతుంది. ఆ ఊసు ఎత్తబోకు. ఆమాట చెప్పటానికే కుంది వంకతో కేకేశాను. వెళ్ళు. వాళ్లుపోయేదాకా వరండాలో కూర్చో" అని చెప్పి తన లౌకికజ్ఞానానికి గర్విస్తూ వెనక దొడ్లోకివెళ్ళింది.

మళ్ళీ సుబ్బారావు వరండాలోకి వచ్చి అరుగుమీద కూర్చున్నాడు. సుబ్బిగాడువాకిట్లో వద్ద పుంత్రికి ప్రక్కగా కూర్చున్నాడు. కూతురు వాడికి నాలుగు గజాల దూరాన కూర్చున్నది. సుబ్బిగాడి హృదయం "పండగపూట కూడా యింత ముద్దకు నోచుకో లేదా!" అన్న ఆలోచనలతో పరిపరి విధాల వాపోవసాగింది. "యీ దొరగారయినా మానెడు గింజలుయిస్తే బాగుండును. యీ పండగ పూటయినా పిల్లలు

పిడికిటి సీతారామయ్య

నాలుగు మెతుకులు తింటారు. కూర్చుని చాలా సేపయింది. యిదివరకెప్పుడు యీ దొరగారు కూలి గింజలకి యిన్ని రోజులు గడిపేవారు కాదు యీ సారే ఆలస్యం అయింది. తప్పకుండా యివ్వాళ గింజలు కొలవచ్చు. ఏమో! రెండు గంటలసేపు కూచోబెట్టి ఆ నారాయణగారు ఏం చేశారు? "యివాళ లేవు రేపు రారా" అన్నారు. వీరు మాత్రం యిస్తారని అనుకోవట మెట్లా?" యీ రకంగా వాడి హృదయంలో చెలరేగిన వివిధ విరుద్ధ ఆలోచనా పరంపరను ముడతలు పడిన వాడి ముఖం యథాతథంగా ప్రకటిస్తోంది.

కాకరపువ్వొత్తులు, మతాబాలు, చిచ్చుబుడ్లు, తాటాకు టపాకాయలు, అంటూ కేక వేస్తున్నాడు ఒక బేరగాడు. ఈ కేకవిని సుబ్బిగాడి కూతురు 'అయ్యా టపాకాయలు కొనవే' అంటూ ఏడ్వటం మొదలుపెట్టింది. పిల్లదాని ఏడుపు సుబ్బిగాడికిమూలిగే నక్కమీద తాటికాయ పడ్డట్లనిపించింది. పితృప్రేమతో వాడి హృదయంచివుక్కుమన్నది. తినటానికి మెతుకే కరువైతే టపాకాయలు కూడా ఎట్లా వస్తయ్. అనిమనస్సులో అనుకొని పిల్లదాన్ని ఓదార్చే కంఠంతో-'అమ్మో! టపాకాయలు కాలతయ్. ఏడిస్తే అరుగో! చిన్నబాబుగారు కొడతారు'. అంటూ అరుగుమీద కూర్చునివున్న సుబ్బారావువైపుకు వ్రేలెత్తి చూపించాడు. ఆ పిల్ల భయంచేత నోటితో ఏడ్వటం మానినా, దాని హృదయం వెయ్యిరెట్లధికంగా విలపించసాగింది. ఆసంగతి సుబ్బిగాడు గుర్తించకపోలేదు.అయినా చేసేదేముంటుంది?

"చిన్న బాబుగారు కొడతారు" అన్న మాట రావు విన్నాడు. పరధ్యాన్నంగావున్న తనులేచి సుబ్బిగాడి వైపుకువచ్చాడు. "ఏరా? మీ పెద్దాడు-లచ్చిగాడు చనిపోయి ఎంతకాలమయిందిరా" అంటూ పూసుపోక, గతాన్ని గురించి ప్రశ్నించాడు.

ప్రశ్న వినేసరికి సుబ్బిగాడి బుర్ర వేయి వక్కలయినట్లనిపించింది. "సర్గా యియ్యాలటికి యేడాది బాబూ. పోయిన దీపావళి పండగనాడు యింకా యియాలకి బతికేవుండాడు దొరా. ఇంకా కాసేపుటికి కాలంసేశాడు" అంటూ దగ్గుత్తికతో సంవత్సరంనాడు మరణించిన పెద్ద కుమారుని గురించి చెబుతున్నాడు. "మంచిదని బండి కట్టాలంటె సుబ్బయ్యగారి యింటికి ఎల్లాడు" అని మరణానికి సంబంధించిన హంశాన్నిగురించి యింకా చెప్పబోతున్నాడు.

"ఏరా? సుబ్బయ్యగారిదగ్గర నౌకరీ చేస్తున్నాడా లేక..." అని సుబ్బారావు ఏమో అడగాలనుకుంటున్నాడు. కాని మధ్యలోనే మాట త్రుంచి మళ్ళీ ప్రారంభించాడు సుబ్బిగాడు "అవును దొరా! నౌకరిచేస్తున్నాడు. మాయదారి నౌకరీ పేణాలు తీసింది. చేతికొచ్చినబిడ్డ. ఆరోజునుంచీ మానోటికాడ కూడే పడిపోయింది" అంటూ తన దుఃఖగాథను చెబుతుంటే పాపం వాడి కండ్లనుండి అప్రయత్నంగానే, రెండు ధారలుగా కన్నీళ్లు చెక్కిళ్లు మీదుగా కారినయ్. చెక్కిళ్ళు తుడుచుకుంటూ వుండగా "ఏరా! మంచిదని బండి కట్టాలంటే సుబ్బయ్యగారి యింటికి వెళ్ళాడు అన్నావు. అక్కడే చనిపోయాడా యేమిటి?" అంటూ అడిగాడు సుబ్బారావు.

"అంతే బాబు. అక్కడే పేణంపోయింది. బండికట్టటానికి దొరగిత్తని-యిప్పుడు అమ్మేశారనుకుంటూ, లేదు-తలతాడు పుచ్చుకుని బజారులోవుండ బండికాడికి తీసుకొత్తన్నాడు. బజారులోకి రానన్నా రాలేదంట. గుమ్మంకాడే కొమ్ములతో కుమ్మేసింది. కుమ్మేసరికి సర్గా రాతి బండమీద పడ్డాడు దొరా. నవరగంతకు బండతగిలిన కూసేపుట్లో చచ్చిపోయాడు" యీవిధంగా గాథంతా గాద్గదికంగా చెప్పాడు.

ఈ విషయం చెబుతున్నంతసేపు చింత నిప్పులాగ మెరుస్తున్న వాడి కండ్లలో ఆవేదన, ఆవేశం, ఆక్రోశం పుట్టిపడుతూ వున్నయ్.

"ఆడి జీతం తాలూకు యింకా ముత్తుం గింజలు రావాలి. అయ్యెకూడ యియ్యనన్నారు సుబ్బయ్యగారు. 'ఎందుకని యియ్యరు' అని అడిగితే, 'నేనైనా మళ్లీ పాలేరునిపెట్టుకోవాలిసిందే గదా. ఈ కోతల రోజులలో మామూలు కట్టుబడికి నౌకరీ ఎవడు చేత్తాడు? నీకొడుకు చచ్చాడని, నీగింజలు నీకిత్తే తరువాత వచ్చే జీతగాడికి

ఎక్కువ కట్టుబడి నీ తాత గాడెవడిస్తాడు?' అంటూ కసురుకున్నారు అని ముగించాడు.

సూరయ్యగారు నిద్రనుండిలేచి, ఆవులిస్తూ వళ్లు విరుచుకుంటూ వరండాలోకి వచ్చాడు. ఆయనను చూచి, కూలిగింజలు అడుగుదామనే వుద్దేశ్యంతో సుబ్బిగాడు గౌరవచిహ్నంగా లేచి నిలబడ్డాడు. వాడిని చూడగానే, ముందు సూరయ్యగారే "ఏంరా కూలికోసం వచ్చావా? వడ్లు బయటలేవురా. పుర్రి తీయించి రేపు ఇస్తానులే." అని చెప్పులు తొడుకున్నాడు. ఈ సమాధానం వినేసరికి సుబ్బిగాడికి నోట మాటరాలేదు. స్పృహతప్పినంత పనిఅయ్యింది. "ఒరేయ్! గొడ్లదొడ్లో చింతమొద్దు వుందిగాని, రెండుపేళ్లు పగలేసిపోరా. మరిచావొస్తోంది. రేపు బారెడుపొద్దెక్కిన తరవాత రా. గింజలు ఇస్తాను" అని పైపంచె సర్దుకుంటూ బజారు గేటు దాటాడు.

"గింజలు ఇవ్వకపోయినా యీ వెట్టిచాకిరీ కూడ తప్పలేదు" అనుకొని వరండా మూలవున్న గొడ్డలి తీసుకొని పేళ్లు పగలేయటానికి గొడ్ల దొడ్లోకి వెళ్ళాడు. సుబ్బిగాడిమనస్సులో తుఫాను బయలుదేరింది. లచ్చిగాడుచనిపోవటం, సుబ్బయ్యగారుగింజలుఇవ్వకపోవటం, కూతురుటపాకాయలకు ఏడ్వటం, నిన్నటినుండీ పస్తువుండటం, మొదలయిన విషయాలన్నీ కండ్లముందు ప్రత్యక్షంగా కనిపిస్తున్నయ్. పేళ్లుచెదిరి పిల్లకు తగులుతయ్యనే వుద్దేశంతో కూతురును దూరంగా కూర్చోబెట్టి వచ్చి, పేళ్లువేయటం ప్రారంభించాడు. నిన్నటినుండి అన్నం లేకపోవటంవల్ల శోషవస్తోంది. అయినా రొప్పుతూ, రోస్తూ పేళ్లు వేస్తున్నాడు. ఆ పిల్లదానికి వుదయం నుండి తిండి లేకపోవటంవల్ల కుడితి తొట్టివద్ద వున్న ఎంగిలి మెతుకులూ, కుడితిలో తేలుతూ వున్న అరటిపండు తొక్కలు తినప్రారంభించింది. ఈ దృశ్యం చూచేసరికి సుబ్బిగాడికి జీవితంమీదే విరక్తిపుట్టింది. ఆకేళ్ళ పిల్లకి పట్టెడు మెతుకులు పెట్టలేని తన్ను తానే నిందించుకున్నాడు. రెక్కలు విరిగేటట్టు కష్టించినా తిండికరువుకు కారణం ఏమిటో తెలుసుకోలేక 'నుదుటవ్రాసిన వ్రాత, అన్నిటికి ఆ భగవంతుడే వుండాడు.' అనుకొనే సుబ్బిగాడిని యీ దృశ్యం, భగవంతుడిని కూడ నిందించేటట్లు చేసింది. తొట్టివద్దనుండి పిల్లను ఇవతలకు తీసుకురావాలనే వుద్దేశ్యంతో ఎత్తిన గొడ్డలి దించబోయాడు. కాని వణుకుతున్న అతని చేతులలోనుండి గొడ్డలి జారి కుడికాలి మీద పడి బొటనవ్రేలు తెగిపోయింది.

సుబ్బిగాడు ఆ బాధతో "అమ్మగారూ ఏలు తెగింది. ఎల్తున్నాను" అని కూతుర్ని ఎడమ చంకలో ఎత్తుకున్నాడు. కాని ఏమి చేయాల్సిందీ తెలియటంలేదు. వాడి హృదయమే తెగినట్లనిపించింది. కర్తవ్యం గుర్తించిన సేవకుల్లాగా వాడి రెండుకాళ్లు ఇంటిముఖంగా, మాలపల్లెవైపుకు సాగిపోతున్నయ్.

ఆకలితో బాధపడుతూ, తండ్రి గింజలు తెస్తాడనికాబోలు సుబ్బిగాడి రెండవ కొడుకు ఎదురుచూస్తూ గుమ్మంముందు నిలబడివున్నాడు. తండ్రి రావటంచూచిన ఆతొమ్మిది సంవత్సరాల కుర్రవాడు "అమ్మోయ్. అయ్య వత్తన్నాడేయ్!" అంటూ పట్టలేని ఆనందంతో ఇంట్లోకి పరుగెత్తాడు. గంగి కూడ, చంకలో ఏడుస్తున్న పిల్లను, ఓదారుస్తూ బంగారు పర్వతం దొరికినంత సంతోషంతో పిల్లలకు రెండు మెతుకులు వండుకోవాలి అనుకుంటూ బయటకు వచ్చింది. అప్పటికి సుబ్బిగాడు ఇంకా పది, పదిహేను గజాల దూరంలో వున్నాడు.

రక్తంతో తడిసిన సుబ్బిగాడి కాలు చూసింది గంగి. నిలువునా నీరయిపోయింది. "ఓరి భగవంతుడో" అంటూ భర్తదగ్గరకు వచ్చింది. ఈఏడ్పువిని పిల్లలు ముగ్గురు బావురుమన్నారు.



మొత్తం అంతా కలసి గుడిసెలోకి వెళ్ళారు. ఈ మొత్తం ఏడుపు వినేసరికి సుబ్బిగాడికి కాలి బాధకుతోడు పండగనాడు కూడ మెతుకు దొరకలేదు గదా అని మానసికబాధ అధికం అయింది.

ఏడుపులు విని ఇరుగుపొరుగు వాళ్లు వచ్చి సుబ్బిగాడిని ఒక కుక్కిమంచంలో పడుకోబెట్టి ఏదో మందు నూరి కాలికి, తెగినచోటున కట్టారు. "పరవాలేదులే" అని గంగికి ధైర్యం చెప్పి "మాట్లాడొద్దు. కళ్లు మూసుకుని పడుకో" అంటూ సుబ్బిగాడికి చెప్పి వెళ్ళిపోయారు.

సుబ్బిగాడికి కాలిబాధకంటే హృదయంలో బాధ అధికం అవుతోంది. కండ్లు మూసుకున్నాడేగాని, బాధను కలిగించే అనేకదృశ్యాలు వాడికి కనిపిస్తున్నవి. గంగి విషయం ఊహించలేని పరిస్థితిలోవున్నది. ఒకవైపున కన్నబిడ్డలకు వుదయంనుండీ ఒక్క మెతుకయినా లేదు. రెండో వైపు భర్తయొక్క వ్రేలు తెగిపోయింది. ఏమి చెయ్యాలో కూడా తెలియటంలేదు. యీ దుఃఖంతో గంగి మనస్సు దారం తెగిన గాలి పడగలా మలుపులు తిరుగుతోంది అర్థంలేని ఆలోచనలతో.

చీకటిపడింది. రోజూకంటె దట్టంగా వ్యాపించింది. ప్రజలందరూ రోజూ కంటె గాఢంగావున్న చీకటిపై కత్తి కట్టారు. ఇంటింటా ప్రమిదలూ, గుమ్మటాలూ, వెలిగించారు. పిల్లలు దివిటీలు త్రిప్పుతున్నారు. కొంత మంది మందుగుండు కాలుస్తున్నారు. గ్రామం అంతా దీపాలతో కళకళ లాడుతోంది.

గ్రామంలోని ఆ అంతులేని దీపాలు చూచినప్పుడే "చీకటిపడింది. ఇంట్లో దీపం వెలిగించాలి" అన్న సంగతి గుర్తుకొచ్చింది. ప్రక్కయింటికి వెళ్ళి దీపం వెలిగించుకొచ్చింది గంగి. బయట టపాకాయలు ప్రేలిన శబ్దం వినిపించినప్పుడల్లా "అయ్యో టపాకాయలు కొనవే" అన్నమాట గుర్తుకొచ్చి, బాంబు పడినట్లుగా వుండేది సుబ్బిగాడికి.

దీపం వెలిగివెలిగి నూనెలేక ఆరిపోయింది. దీపం బుడ్డి పాపం ఆ బాధలు చూడలేక ఆరిపోయిందనిపించింది. దీపం పోవటంతో గంగికి మరీ గంగ వెర్రులు పుట్టినట్లయింది. "వూరంతా దీపాలతో నిండిపోతే యిదేమి ఖర్మం, నీకు కూడా జాలిలేదా భగవంతుడా" అంటూ నెత్తీ నోరూ మోదుకోసాగింది. గంగి ఏడ్పువిని సుబ్బిగాడుకూడా ఆవురుమన్నాడు. పిల్లలు కూడ ఆకలిచేతో మరి కంగారువలనో ఏడవటం మొదలుపెట్టారు. పిల్లల పస్తుకుతోడు, దీపావళినాడు ఇంట్లో దీపమే లేకపోవటం, కీడు అనుకునో ఏమో మళ్ళీ శోకాలు మొదలుపెట్టింది గంగి. ఆ శోకాలు ఎవరికీ వినిపించినట్లులేదు. అందరూ పండగ సందట్లో వున్నారు.

---

ఫైర్ స్టేషన్‌లోని టెలిఫోన్ బెల్ మ్రోగింది. ఆఫీసరు అందుకున్నాడు.

"అది ఫైర్ స్టేషనేనా?" ఒణుకుతున్న కంఠం వినిపించింది.

"అవును."

"ఆహా. నేను ఈమధ్యే క్రొత్తగా తోట వేసుకున్నాను. దాంట్లో సరికొత్త మొక్కలు కూడా కొన్ని వేశాను..."

"అయితే అగ్నిప్రమాదం ఎక్కడ?"

"కొన్ని క్రొత్తరకం మొక్కలు ఎంతో ఖరీదు పెట్టికొన్నాను..."

"ఇదుగో చూడండి. మీరు పువ్వుల బజారుకు ఫోన్ చెయ్యదలచుకున్నారా?" అన్నాడు ఆఫీసరు విని విని.

"అబ్బే లేదండీ! అసలు విషయం ఇదీ. మా పొరిగింటికి నిప్పంటుకుంది. మీ ఫైర్ ఇంజన్లువచ్చి నాతోట అంతా తొక్కి పాడుచేయడం నా కిష్టం లేదు."